విధి నిర్వహణలో న్యాయవాదుల సహకారం మరువలేనిది

● సీనియర్ సివిల్ జడ్జి శ్యాంకుమార్

బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తి శ్యాంకుమార్ దంపతులను సన్మానిస్తున్న న్యాయవాదులు

హుజూర్‌నగర్, ఏప్రిల్ 21: హుజూర్‌నగర్‌లో న్యాయమూర్తిగా తాను విధులు నిర్వర్తించిన మూడేండ్లలో న్యాయవాదులు అందించిన సహకారం మరువలేనిదని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యాంకుమార్ అన్నారు. బదిలీపై వెళ్తున్న ఆయనకు హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వీడ్కోలు సభను ఏర్పాటు చేసి న్యాయమూర్తి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్యాంకుమార్ మాట్లాడుతూ 2022లో తాను బాధ్యతలు తీసుకున్న సమయంలో 1,067 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రస్తుతం వాటి సంఖ్యను 300కు తగ్గించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, న్యాయవాదులు శ్రీనివాసరావు, రవికుమార్, రాఘవరావు, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణ, కృష్ణయ్య, నాగేశ్వర్‌రావు, అంజయ్య, ఏజీ పీలు రేణుక, సురేశ్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శికి సన్మానం

న్యాయమూర్తి శ్రీవాణిని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

సూర్యాపేట లీగల్, ఏప్రిల్ 21: బదిలీపై వెళ్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణిని సూర్యాపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సూర్యాపేట బార్ అసోసియేషన్ న్యాయవాదుల విశ్రాంతి భవనంలో సోమవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంపెల్లి లింగయ్య ఆధ్వర్యంలో న్యాయమూర్తి శ్రీవాణిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి.మధు, కార్యదర్శి ఎస్.రాజు, న్యాయవాదులు వి.వెంకటేశ్వర్‌రావు, టి.శ్రీనివాసరావు, ఎన్.సుదర్శన్‌రెడ్డి, జె.శశిధర్ పాల్గొన్నారు.

స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేయాలి

● సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖర్ల ధర్నా

రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దస్తావేజు లేఖర్లు

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 21: ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన స్లాట్ బుకింగ్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలని దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు తన్వీర్ హుస్సేన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానం రద్దు చేసిందని, కానీ మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ విధానాన్ని అమలు చేయడంతో కొన్ని వేల దస్తావేజు లేఖర్ల కుటుంబాలు ఉపాధిని కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్లాట్ బుకింగ్ విధానానికి వ్యతిరేకంగా దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ బంద్ పాటించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ అంబేద్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మురలీమనోహర్‌రావు, కందిమళ్ల మధుసూదన్, ఎండీ.గౌస్‌ఖాన్, రవీందర్‌రావు, గట్టు మహేందర్, వీర్లపాటి వెంకన్న, మారోజు విక్రమ్‌కుమార్, చెరుకు శ్రీనివాస్, కొల్లూరు సోమయ్య, వినయ్‌కుమార్, నజీర్, పసుపులేటి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

'రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలి'

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్

అర్వపల్లి, ఏప్రిల్ 21: ఎల్కతుర్తిలో ఈ నెల 27వ తేదీన జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు విద్యార్థులు, యువత, రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండల పరిధి రామన్నగూడెంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు ఊరూరా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కదిలిరావాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మొరిశెట్టి ఉపేందర్, మన్నె లక్ష్మీనరసయ్యయాదవ్, మిర్యాల వెంకన్న, గోసుల విజయ్‌కుమార్, కట్టెల మల్లేశ్, మురళి, మల్లయ్య, ఎల్లంరాజు, సంపతి కిరణ్, గోపాల్, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

● ఆ పార్టీ పాలకవీడు మండల ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి

పాలకవీడు, ఏప్రిల్ 21: ఈ నెల 27న జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు తాటికొండ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని రాఘవపురం, మీగడంపహాడ్ తండా, దేవ్లాతండా గ్రామాల్లో రజతోత్సవ సభకు సంబంధించిన కరపత్రాలను నాయకులతో కలిసి సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆశలను, ఆకాంక్షలను కేసీఆర్ మాత్రమే నెరవేర్చగలరని అన్నారు. రజతోత్సవ సభకు గులాబీ శ్రేణులు స్వచ్ఛందంగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మూడు గోపాల్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి పత్తి లారీ దగ్ధం

● సుమారు రూ.80 లక్షల నష్టం

దగ్ధమైన లారీలోని పత్తిని జేసీబీ సహాయంతో తొలగిస్తున్న దృశ్యం

నేరేడుచర్ల, ఏప్రిల్ 21: రోడ్డుపై వెళ్తున్న పత్తి లారీపై పిడుగు పడి లారీ మొత్తం దగ్ధమైన ఘటన నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, లారీ డ్రైవర్ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం. తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీలో కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం చింతపల్లిలోని కవిత కాటన్ ఇండస్ట్రీస్ పత్తి మిల్లు నుంచి రూ. 40లక్షల విలువ గల 24 టన్నుల పత్తిని లోడు చేసుకున్నారు. తమిళనాడు రాష్ట్రంలోని కోవైపట్టిలోని మహావిష్ణు స్పిన్నింగ్ మిల్లుకు పత్తి లారీతో బయల్దేరి వెళ్తున్న సమయంలో ఆదివారం రాత్రి 11.30 సమయంలో నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి మిర్యాలగూడ -కోదాడ ప్రధాన రహదారిపై ఉరుములు, మెరుపులు వచ్చాయి. లారీపై ఉన్న పత్తి నుంచి మంట వస్తుందని స్థానికులు, వెనుక నుంచి వస్తున్న వాహనదారులు తెలిపారు. దీంతో లారీ పక్కకు ఆపి చూడగా మంట విపరీతంగా వస్తుంది. వెంటనే స్థానికులు పోలీసులు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. మిర్యాలగూడ నుంచి ఫైర్ ఇంజిన్ వచ్చి మంటలు ఆర్పినా అదుపు కాలేదు. జేసీబీ సహాయంతో లారీలోని పత్తిని తొలగించారు. సుమారు 8 గంటలు కష్టపడి మంటలు ఆర్పారు. పిడుగు పడి ప్రమాదం సంభవించిందా లేదా ఏదైనా విద్యుత్ వైర్లు తగిలి షార్ట్ సర్క్యూట్ జరిగి లారీపై మంటలు వ్యాపించాయా అనే విషయం తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 40లక్షల విలువు గల పత్తితోపాటు రూ. 40 లక్షల విలువ గల లారీ మొత్తం పూర్తిగా దగ్ధమైంది. ఎస్ఐ రవీందర్ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

'భూ భారతి' తో భూముల సమస్యలకు పరిష్కారం

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

అనంతగిరి: శాంతినగర్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్

కోదాడ/అనంతగిరి, ఏప్రిల్ 21: భూ భారతి చట్టంతో భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. భూ భారతి చట్టంపై కోదాడ పట్టణంలోని ఆర్ఎస్‌వీ ఫంక్షన్ హాల్, అనంతగిరి మండలం శాంతినగర్‌లోని ఎస్‌డబ్ల్యూసీ గోదాంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. భూ భారతి ద్వారా అధికార వికేంద్రీకరణ జరుగుతుందని, సమస్యను బట్టి తాసీల్దార్, ఆర్డీఓ, కలెక్టర్ స్థాయిలో పరిష్కరించవచ్చని చెప్పారు.భూ విస్తీర్ణంలో మార్పులు, మిస్సింగ్ సర్వే నంబర్ సవరణలు వంటి ప్రతి సమస్యకు మీ సేవ కేంద్రాల ద్వారా కాకుండా స్వయంగా దరఖాస్తు చేసుకునేలా భూ భారతి పోర్టల్ రూపొందించారని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఆధార్ మాదిరిగానే భూమికి భూదార్ అనే యూనిక్ నంబర్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రతి భూమికి సరిహద్దులు నిర్ణయించి సర్వే మ్యాప్‌ను భూ భారతి పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునేలా అవకాశం కల్పించనున్నట్లు వివరించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీఓ సూర్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు, తాసీల్దార్లు వాజీద్ అలీ, హిమబిందు, ఎంపీడీఓ రామచంద్రరావు, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, మాజీ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాస్ రెడ్డి, అనంతగిరి మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటీసీ ఉమ పాల్గొన్నారు.

ఇండ్ల లబ్ధిదారుల విచారణ చేపట్టాలి

సూర్యాపేట: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల విచారణ ఈ నెల 30 నాటికి పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నియోజకవర్గాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్ల కమిటీల ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత మే 3 నుంచి 5వ తేదీ వరకు ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను నోటీస్ బోర్డులో ప్రదర్శించనున్నట్లు చెప్పారు. జిల్లాలో మొదటి దశలో 4322 ఇండ్లు, రెండో దశలో 9,678 ఇండ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

● అదనపు కలెక్టర్ రాంబాబు

ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేట, ఏప్రిల్ 21: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 93 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అత్యధికంగా భూ సమస్యలపై దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. తాసీల్దార్లు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం భారతి రంగా ఆర్గనైజేషన్ ఫర్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 700 మంది టీబీ పేషెంట్లకు న్యూట్రిషన్ ఫుడ్ అదనపు కలెక్టర్ చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ అప్పారావు, డీఎఫ్ఓ సతీశ్‌కుమార్, డీఎంహెచ్ఓ కోటాచలం, డీడబ్ల్యూఓ నరసింహారావు, సీపీఓ కిషన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి చేయూత

సుదర్శన్‌రెడ్డి కుమార్తెకు బ్యాంక్ ఖాతా పుస్తకాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూర్.ఎస్, ఏప్రిల్ 21: మండల పరిధిలోని శెట్టిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పల్లా సుదర్శన్ రెడ్డి గత ఫిబ్రవరి నెలలో అనారోగ్యంతో మరణించారు. ఆయన కుటుంబానికి తెలంగాణ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సహకారంతో ఆర్థిక చేయూత అందించారు. సుదర్శన్‌రెడ్డి కుమార్తె పేరు మీద రూ.1,31,700 బ్యాంక్‌లో డిపాజిట్ చేసి ఖాతా పుస్తకాన్ని ఎంఈఓలు శేషగాని శ్రీనివాస్‌గౌడ్, దారా సింగ్, ప్రధానోపాధ్యాయుడు గోపగాని సోమయ్య చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ మన్నూరు నాగన్న, జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల దేవరాజు, జిల్లా నాయకులు అమరబోయిన రామకృష్ణ, రావులకొల్లు సుధాకర్, మెంతబోయిన సైదులు, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థులకు ఆటపాటలతో పాఠాలు బోధించాలి'

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి సుబ్బలక్ష్మి

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 21: విద్యార్థులకు ఆటపాటలతో పాఠాలు బోధించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి సుబ్బలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని 39వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డేలో ఆమె పాల్గొని మాట్లాడారు. పిల్లలకు చిన్ననాటి నుంచి ఆటపాటలతో విద్యను బోధిస్తే మానసికంగా, శారీరకంగా అభివృద్ధి చెందుతారని చెప్పారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ గోనె నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు సోమ పద్మ, గడ్డం భాగ్యలక్ష్మి, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

లారీలు రాక నిలిచిన ధాన్యం కొనుగోళ్లు

అనంతారం కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు

పెన్‌పహాడ్, ఏప్రిల్ 21: యాసంగిలో ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఓ పక్క కొనుగోలు కేంద్రాల్లో లెక్క ప్రకారం తూకాలు జరుగకపోగా, మరోపక్క వడ్లు బాగా లేవని, బస్తాలు దించుకోమని, మరోసారి తూర్పార పట్టాలంటూ మిల్లర్లు చెబుతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. దీనికితోడు కాంటాలు వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు రాకపోవడం మరింత సమస్యగా మారింది. మండలంలోని అనాజిపురంలో నిర్వాహకులు 1,355 క్వింటాళ్లు కొనుగోలు చేసి ఐదు లారీల ద్వారా మిల్లులకు ట్రాన్స్‌పోర్టు చేశారు. వాటిలో రెండు లారీలు దిగుమతి కాక వారం రోజులు కావొస్తుంది. అంతేకాకుండా లారీలు వస్తాయన్న ఆలోచనలో పలు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వేల బస్తాలు కాంటాలు వేయగా లారీలు రాక ట్రాన్స్‌పోర్ట్ కోసం ఎదురు చూస్తున్నారు. అనంతారం, నారాయణగూడెం పీఏసీఎస్ కేంద్రాల్లో కాంటాలు కాక కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు కుప్పలుగా దర్శనమిస్తున్నాయి.

'బీఆర్ఎస్ సభకు గ్రామాల నుంచి కదం తొక్కాలి'

సర్వారంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

మోతె, ఏప్రిల్ 21: బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గ్రామాల నుంచి కదం తొక్కాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు శీలం సైదులుయాదవ్, జిల్లా నాయకుడు ఏలూరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండలంలోని సర్వారం గ్రామంలో వాల్ రైటింగ్స్ ద్వారా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోతె మండలం నుంచి సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పల్స మల్సూర్, నాయకులు కుదురుపాక రమేశ్, ఉప్పల మల్లయ్యయాదవ్, మట్టపల్లి శ్రీను, వడ్డే మాన్సూర్, మేకల రామయ్య, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో మంత్రి ఉత్తమ్ పర్యటన వాయిదా

హుజూర్‌నగర్, ఏప్రిల్ 21: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌నగర్ పర్యటన వాయిదా పడింది. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపెన్ ఇంటర్ పరీక్షలు జరుగుతున్నందున ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో మంగళవారం జరుగాల్సిన కొత్త భవనాల శంకుస్థాపన కార్యక్రమాన్ని నెలఖరుకు వాయిదా వేసినట్లు మంత్రి కార్యాలయం నుంచి సోమవారం ఒక ప్రకటన వెలువడింది.

బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్లు

హుజూర్‌నగర్, ఏప్రిల్ 21: హుజూర్‌నగర్ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ సోమవారం ప్రారంభమైంది. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి జక్కుల వీరయ్య, ఉపాధ్యక్ష పదవికి కుక్కడపు సైదులు, ప్రధాన కార్యదర్శికి బి.నాగేశ్వర్‌రావు, జాయింట్ కార్యదర్శికి మద్దుల నాగేశ్వర్‌రావు, లైబ్రరీ సెక్రటరీ పదవికి కొనతం శ్రీనివాస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యుల పదవులకు షేక్ మౌలాబీ నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారులుగా రాఘవరావు, అంజయ్య నామినేషన్ పత్రాలను స్వీకరించారు.

ఉచిత వైద్య శిబిరం

మఠంపల్లి, ఏప్రిల్ 21: మండల పరిధిలోని నాగార్జున సిమెంట్ పరిశ్రమ వైద్యశాలలో బ్లూక్రాస్ సంస్థ ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన నాగార్జున హాస్పిటల్ వైద్యుల సహకారంతో సోమవారం ఉచిత మధుమేహ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 50 మందికి పైగా పరీక్షించి రూ.30 వేలు విలువ చేసే మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా పరిశ్రమ సీనియర్ ప్రెసిడెంట్ చక్రధర్ మాట్లాడుతూ త్వరలో వాసన్ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ జి.హిమబిందు, డాక్టర్ శ్రీహరిరావు, సతీశ్, దస్తగిరిరెడ్డి, పి.రాము పాల్గొన్నారు.

27న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

నాగారం, ఏప్రిల్ 21: మండలంలోని పసునూరు ఆదర్శ పాఠశాలలో 6 నుంచి 10వ తరగతుల్లో ప్రవేశాలకు నిర్వహించనున్న పరీక్ష హాల్ టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ బల్గూరి చంద్రబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు 6వ తరగతిలో ప్రవేశాలకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 7,8,9,10వ తరగతుల్లో ప్రవేశాలకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

'వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి'

నూతనకల్, ఏప్రిల్ 21: వేసవి కాలం నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారిణి ఆశ్రితరెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలు వడదెబ్బ తగులకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకునేలా తెలియజేయాలని చెప్పారు. సమావేశంలో సీహెచ్ఓ చరణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి'

మేళ్లచెర్వు, ఏప్రిల్ 21: వేసవి నేపథ్యంలో అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మైహోం పరిశ్రమ ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు సూచించారు. సోమవారం పరిశ్రమ ఆవరణలో నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాల ముగింపు వేడుకలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలపై నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. శ్రీరామ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలి : ఎస్పీ నరసింహ

ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 21: బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై త్వరితగతిన స్పందిస్తూ చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ కె.నరసింహ తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులతో ఎస్పీ మాట్లాడి వారి అర్జీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలని, ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

జిల్లాలోని పలు పట్టణాల్లో రోజురోజుకూ వాహనాల రద్దీ పెరుగుతుందని, ట్రాఫిక్ అంతరాయం నిరోధించడానికి పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటుందని ఎస్పీ నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యం వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు వాహనదారులకు, వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు, వాహనదారులు, వీధి వ్యాపారులకు పోలీసులకు సహకరించాలని కోరారు. దుకాణాలు నిర్వహించే వారు వస్తువులను రోడ్ల మధ్య వరకు పెట్టడం వల్ల వచ్చిపోయే వాహనాలకు, ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. దుకాణాల ముందు అడ్డగోలుగా వాహనాలు నిలిపితే దుకాణ యజమానులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసుల సూచనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్పీ నరసింహ పేర్కొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

● అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి

వ్యాసరచన పోటీలో పాల్గొన్న బాలికలు

నేరేడుచర్ల, ఏప్రిల్ 21: పోషకాహారం, చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. పోషణ్ పక్వాడ్‌లో కార్యక్రమంలో భాగంగా మండలంలోని దిర్శించర్ల గ్రామంలో కిశోర బాలికలకు పోషకాహారం ప్రాముఖ్యతపై సోమవారం వ్యాసరచన పోటీలను నిర్వహించి మాట్లాడారు. అనంతరం వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎలిజిబెత్, వెంకటరమణ, చంద్రకళ, ఆయా విజయలక్ష్మి పాల్గొన్నారు.

'పంచాయతీ ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలి'

మాట్లాడుతున్న వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు గిద్దె రాజేశ్

మునగాల, ఏప్రిల్ 21: గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు గిద్దె రాజేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమిళనాడులో ముఖ్యమంత్రి స్టాలిన్ దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల పరిధిలోని కలకోవ గ్రామంలో సోమవారం స్టాలిన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించేందుకు చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఈదయ్య, మోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మధు, వికాస్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న తాగునీరు

మఠంపల్లి మండల కేంద్రంలో రోడ్డుపై వృథాగా పోతున్న తాగునీరు

మఠంపల్లి, ఏప్రిల్ 21: మండల కేంద్రం మఠంపల్లిలోని ప్రధాన రహదారిపై మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి తాగునీరు రోడ్డుపై వృథాగా పోతోంది. అసలే వేసవి కాలం నీటి కొరత ఉంటుందని, దీనికి తోడు తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు నుంచి స్పందన లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై నీరు పోతుండడంతో గుంత ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ప్